## క్లుప్తంగా

### చైనా మాంజా అమ్మొద్దు


హుజూరాబాద్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

**హుజూరాబాద్:** చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం పలు కిరాణా షాపుల్లో తనిఖీలు చేసిన అనంతరం మాట్లాడారు. చైనా మాంజాలతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలతో పాటు పక్షుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. చైనా మాంజా అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ యూనస్ అహ్మద్‌అలీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**శంకరపట్నం:** చైనా మాంజా అమ్మితే కేసులు నమోదు చేస్తామని కేశవపట్నం ఎస్సై రవి హెచ్చరించారు. మండలంలోని కేశవపట్నంలో మంగళవారం కిరాణాషాపులు, కంగన్‌హాల్‌ను తనిఖీ చేశారు. చైనా మాంజాతో గాలిపటాలు ఎగరేస్తే పక్షులు, మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయని, వ్యాపారులు విక్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుదాకర్, సిబ్బంది ఉన్నారు.

### విద్యార్థులకు అల్పాహారం


అల్పాహారం అందిస్తున్న ప్రిన్సిపాల్

**హుజూరాబాద్:** వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్‌తోపాటు అల్పాహారం అందజేస్తున్నామని ప్రిన్సిపాల్ ఆంజనేయరావు అన్నారు. మంగళవారం సాయంత్రం విద్యార్థులకు అల్పహారం అందజేసిన అనంతరం మాట్లాడారు. కళాశాల అధ్యాపకుల సహకారంతో స్నాక్స్ అందిస్తున్నామని, విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పాఠ్యాంశాల్లో సందేహాలను అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న సాగుతో లాభాలు


కార్యక్రమం వీక్షిస్తున్న అధికారులు, రైతులు

**తిమ్మాపూర్:** మండలం కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగుతో కలిగే లాభాలు, సాగులో పాటించాల్సిన మెళకువలు తెలియజేశారు. కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జి.మంజులత మొక్కజొన్న సాగుపై సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు మొగిలిపాలెంకు చెందిన మోరపల్లి మల్లారెడ్డి దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు, చీడపీడల నివారణ గూర్చి అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేందర్, రమ్యశ్రీ, ఏఈవోలు పూర్ణ, పున్నం చందర్, ప్రవీణ్, భావన, అర్చన, శ్రావణి పాల్గొన్నారు.

### డ్రోన్ల వైపు రైతుల చూపు


డ్రోన్‌తో మొక్కజొన్నపై మందు పిచికారీ

**గంగాధర:** క్రిమిసంహారక మందుల పిచికారీకి కూలీల కొరతతోపాటు సకాలంలో పిచికారి చేయలేక తెగులు నివారణ కాక తంటాలు పడుతున్న రైతులకు డ్రోన్లు అండగా నిలుస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని మొక్కజొన్న, వరి, తదితర పంటలకు మందులు పిచికారీ చేయడానికి రైతులు డ్రోన్ల వైపు మొగ్గు చూపుతున్నారని డ్రోన్ ఆపరేటర్ శివ తెలిపారు. ఎకరాకు సరిపోయే మందు 12 లీటర్ల నీటిలో కలిపి డ్రోన్‌తో పది నిమిషాల్లో పిచికారి చేస్తున్నారని, ఎకరాకు రూ.500 తీసుకుంటున్నారని రైతులు తెలిపారు.

### ఉచిత పశువైద్య శిబిరం

**ఇల్లందకుంట:** మర్రివానిపల్లి లో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి సత్యప్రసాద్‌రెడ్డి, ఇల్లందకుంట, జమ్మికుంట పశువైద్యాధికారులు విజేందర్‌రావు, రాజ్‌కుమార్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జానీపాషా, శ్రీనివాస్, తిరుపతి, రాజ్‌కుమార్, మహేందర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


రంబుల్ ట్రిప్స్ ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు


రోడ్డు భద్రతా నియమాలను వివరిస్తున్న ఎంవీఐ వేణు

**హుజూరాబాద్:** అతివేగం ప్రాణాంతకం.. జాగ్రత్తగా వాహనాలు నడపాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. హుజూరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను మంగళవారం గుర్తించారు. అనంతరం సైదాపూర్ రోడ్డులో రంబుల్ ట్రిప్స్ ఏర్పాటు చేశారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మాట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్, కారులో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే వాహనం సీజ్ చేయడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, రూరల్ సీఐ వెంకట్ గౌడ్, ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ పాల్గొన్నారు.

**రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత..**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంవీఐ కంచి వేణు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని గూడ్స్ ఆటో ప్రాంగణం వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స లేకుండా, మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇన్సూరెన్స్ రెన్యువల్, ట్యాక్స్, పొల్యూషన్ రికార్డులు సరిగా ఉండాలన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డ్ గుర్రం శ్రీకాంత్, గూడ్స్ యూనియన్ నాయకులు సంపత్, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవి

**శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతాపై ట్రైనీ ఎస్సై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, కెపాసిటికి మించి ప్రయాణికులను తరలించొద్దన్నారు. డ్రైవర్లకు లైసెన్స్, ఆర్‌సీ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.



**వీణవంక:** మండలంలోని కనపర్తి గ్రామ శివారులో వీణవంకకు వెళ్లే ప్రధాన రోడ్డు వానాకాలంలో కురిసిన వర్షాలకు ధ్వంసమైంది. కల్వర్టు నిర్మించకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి**
**శ్రీధర్, ఎంపీడీవో, సెల్ నంబర్: 9989930710**

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

**మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227**

# ప్రజా వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- 50 పడకల ఆస్పత్రికి స్థల పరిశీలన


నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**మానకొండూర్:** ప్రజావైద్యం, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్‌తో కలిసి మానకొండూర్ లో 50 పడకల ఆసుపత్రి కోసం స్థల పరిశీలన చేశారు. ప్రజా వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని, నియోజకవర్గంతో పాటు వివిధ మండలాల్లో ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. యాభై పడకల ఆస్పత్రికి ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన స్థలం అనువుగా ఉంటుందని, మార్కెట్‌యార్డ్‌కు చెందిన కొంత స్థలాన్ని తీసుకుంటే సరిపోతుందని, తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వెంట తహసీల్దార్ రాజేశ్వరి, కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పద్మాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గన్నేరువరం మహిళా అధ్యక్షురాలిగా రాజేశ్వరి**

**గన్నేరువరం:** కాంగ్రెస్ పార్టీ గన్నేరువరం మండల మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన జెల్లా రాజేశ్వరి నియామకమయ్యారు. కరీంనగర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి మంగళవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదరి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం వాసు, తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు,టీచర్లు

**జమ్మికుంట:** పట్టణంలోని ఎమ్మార్సీ భవనం ఆవరణలో ఎస్‌టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్) జమ్మికుంట మండల అధ్యక్షుడు రజాక్, ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను జమ్మికుంట, ఇల్లందకుంట ఎంఈవోలు హేమలత, రాములునాయక్ మంగళవారం ఆవిష్కరించారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్‌టీయూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ పురుషోత్తమమూర్తి, ఆర్థిక కార్యదర్శి సమ్మయ్య, కార్యవర్గ సభ్యులు తిరుపతి, అశోక్‌కుమార్, రాజు, తిరుపతినాయక్, హరీష్, ప్రవీణ్, తేజస్విని, సమీర, వినీత, రాగిణి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

### సమయపాలన పాటించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తిరుపతిరెడ్డి

**చిగురుమామిడి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీపాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్రశాఖ అసోసియేట్ అధ్యక్షుడు దుబ్బాక బాల్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్, తిరుపతినాయక్, సీనియర్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, విక్రమ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఇల్లందకుంట:** కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ కట్ట పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు కామారెడ్డి బహిరంగ సభలో ప్రకటించిన విధంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నా హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మురహరి శంకర్, కమ్మగోని అజయ్, సమ్మయ్య, వీరస్వామి, సురేందర్, మురళి, దుర్గయ్య, రాజేష్, రాజు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల పేరు మార్చి ప్రచారం


మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్, నాయకులు

**రామడుగు:** కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చి ప్రచారం చేసుకుంటుందని బీజేపీ రామడుగు మండల ప్రధాన కార్యదర్శి పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్ విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద పేదలకు ఇళ్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఇందిరమ్మ ఇళ్లుగా పేరు మార్చి ప్రచారం చేస్తుందని, ప్రతి పథకానికి పేరు మార్పు చేసి ప్రచారం చేసుకుంటుందని, పేదలకు రాష్ట్ర ప్రభుత్వం చేసింది శూన్యమేనని ఆరోపించారు. సమావేశంలో నాయకులు రామ్, లక్ష్మణ్, జయంత్, తిరుపతి, శ్రీనివాస్, కనకయ్య, కనకరాజు, రాహుల్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల నిరసన


గన్నేరువరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**చొప్పదండి:** రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం పోలీసులు నిరసనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ మాదూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు గడ్డం చుక్కరెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, కొత్త గంగారెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, బందారపు అజయ్‌కుమార్, గాండ్ల లక్ష్మణ్, సుద్దాల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**గన్నేరువరం:** ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల హామీని ప్రభుత్వం విస్మరించిదని పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. హామీలు అమలు చేసే వరకు రైతుల పక్షాన పోరాటం తప్పదని హెచ్చరించారు. మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నవీన, డైరెక్టర్ అటికం రవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రూ.28 వేల విరాళం


దాతలను సన్మానిస్తున్న టీచర్లు, తదితరులు

**గంగాధర:** మండలంలోని గర్షకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు కంకణాల కిషన్‌రెడ్డి, చిందం ఆంజనేయులు, కత్తి శంకర్‌గౌడ్ మంగళవారం రూ.28వేలు విరాళంగా అందజేశారు. సౌండ్‌సిస్టమ్ కొనుగోలుకు విరాళం అందజేసిన దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శశికాంత్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

### చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**జమ్మికుంట:** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జమ్మికుంట ఎక్సైజ్ ఎస్‌ఐ సౌమ్య అన్నారు. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుల్ ఫయాజ్, మహేశ్, మౌనిక, కళాశాల ప్రిన్సిపల్ లచ్చయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

### జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అవార్డు

**గన్నేరువరం:** మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హైబిజ్‌టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య, హైబిజ్ టీవీ నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును హెచ్‌ఎం శారద అందుకున్నారు. చదువు, సంస్కృతికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలను అభివృద్ధిని చేయడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన విద్యార్థుల భవిష్యత్‌కు చేస్తున్న కృషికి కరీంనగర్ జిల్లా నుంచి జంగపల్లి పాఠశాలకు అవార్డు దక్కిందని, అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో హైబిజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్లు రాజగోపాల్, సంధ్యారాణి, ఉపాధ్యాయులు వసుంధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### క్షీరాభిషేకం

**జమ్మికుంట:** పట్టణంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క చిత్రపటాలకు మంగళవారం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ నెల 26న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సతీశ్‌రెడ్డి, అనిల్, అజయ్‌గౌడ్, రాజయ్య, శ్రీనివాస్, సూర్య, లింగారావు, సదానందం, రమేశ్, సతీశ్ పాల్గొన్నారు.

### ఈతచెట్లు తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలి

**జమ్మికుంట:** మండలంలోని మడిపల్లి తాటివనంలో ఇటీవల ఈతచెట్లను తొలగించారు. దీనిపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మడిపల్లి గీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఒల్లాల రాజుగౌడ్ అన్నారు. మంగళవారం గీత కార్మికుల విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈత చెట్లను తొలిగిస్తుండటంతో ఉపాధి కోల్పోతున్నామని, గీత కార్మికులకు అండగా ఉండాల్సిన ఎక్సైజ్ అధికారులు తొలగించిన వారికే వత్తాసు పలుకుతూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొండపాక సదానందం, మాచర్ల సదానందం, ముక్కెర తిరుపతి, కన్నె రాములు, బొనగాని శ్రీనివాస్, ఒల్లాల రాజయ్య, తిరుపతి, రాజయ్య, రవీందర్, కృష్ణమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

- **హైమాస్ట్ లైట్లు ప్రారంభం**

**హుజూరాబాద్:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం రాత్రి హైమాస్ట్ లైట్లను మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ప్రారంభించారు. ప్రజలు, క్రీడాకారులు, వాకర్స్‌కు ఉపయోగకరంగా ఉండేందుకుగాను రూ.ఐదు లక్షలతో లైట్లు ఏర్పాటు చేశామన్నారు.

- **పతంగుల దుకాణాల్లో తనిఖీ**

**జమ్మికుంట:** పట్టణంలోని వివిధ పతంగుల దుకాణాలను టౌన్ సీఐ వరంగంటి రవి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చైనా మాంజాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అమ్మకాలపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. చైనా మాంజాలను అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- **నియామకం**

**హుజూరాబాద్:** వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన నిర్వహణ కమిటీ హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా అకినపల్లి శిరీష నియామకమయ్యారు. చెల్పూరు గ్రామానికి చెందిన శిరీష ఎమ్మార్పీఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేదని, ఆమె కృషికి గుర్తింపు లభించిందని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు శిరీష హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

- **అవగాహన**

**హుజూరాబాద్:** గ్యాస్ వినియోగదారులు సురక్ష రబ్బరు ట్యూబులు మార్చుకోవాలని తెలంగాణ వంటగ్యాస్ డీలర్ల అధికార ప్రతినిధి, హుజూరాబాద్ అంబుజా గ్యాస్ ఏజెన్సీస్ అధినేత పీవీ మదన్‌మోహన్ కోరారు. పట్టణంలోని అంబుజా గ్యాస్ ఏజెన్సీ షోరూంలో స్టాఫ్, డెలివరీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

- **మానసిక ఒత్తిడికి గురికావొద్దు**

**వీణవంక:** పరీక్ష సమయంలో మానసిక ఒత్తిడికి గురికావొద్దని మోటివేటర్, బ్రైట్ లైఫ్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అధ్యక్షతన కెరీర్ గైడెన్స్, పరీక్ష సమయంలో అధిగమించాల్సిన విషయాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసకావొద్దని, లక్ష్యం చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా టైం మెనేజ్‌మెంట్‌ను వివరించారు.

- **బీజేపీ ఆఫీస్‌పై దాడి హేయమైన చర్య**

**వీణవంక:** బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి హేయమైన చర్య అని మండలంలోని బీజేపీ నాయకులు అన్నారు. మండలంలోని చల్లూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి మంగళవారం మాట్లాడారు. పోలీసుల సమక్షంలో కార్యాలయంపై దాడి జరిగిందని,

- **శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు**

**ఇల్లందకుంట:** మండలంలోని రాచపల్లి గ్రామం నుంచి అయప్పస్వాములు ఇరుముడులతో శబరిమలకు బయలుదేరారు. వేదపండితుడు సువర్ణశ్రీధర్‌శర్మ ఆశీర్వచనాలు అందించారు.మాజీ ఎంపీపీ సరిగొమ్ముల పావనివెంకటేశ్ స్వాముల అవసరాలకురూ.ఐదువేలు అందజేశారు.

- **భూమిపూజ**

**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆవరణలో రూ.మూడు లక్షలతో నిర్మిస్తున్న పబ్లిక్ టాయిలెట్స్ పనులకు ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు.

- **ట్రస్ట్ సేవలు వినియోగించుకోవాలి**

**గంగాధర:** గామ ఫౌండేషన్ సేవలను అర్హులైన తెల్లరేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురమల్ల మనోహర్ అన్నారు. ట్రస్టు సీఈవో దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని తాడిజర్రి, పెద్ద ఆచంపల్లి గ్రామాల్లోని ఇరవై కుటుంబాలకు మంగళవారం పదిరకాల నిత్యావసర సరుకులు అందజేశారు.

- **పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

**గంగాధర:** ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గర్షకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇటీవల డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయుల రెగ్యులర్ వేతనాల సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

- **పోలీసుల అదుపులో యువకులు**

**శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కేశవపట్నంలో బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా సోమవారం రాత్రి ఐరన్ రాడ్లను చోరీ చేయడానికి యత్నించగా బ్లూకోల్ట్స్ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి మంగళవారం విచారించినట్టు తెలిసింది.

- **వరకట్న వేధింపు కేసు**

**జమ్మికుంట:** అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు పాల్పడినవారిపై మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. కరీంనగర్‌కు చెందిన హుమేర ఫాతిమాకు జమ్మికుంట పట్టణానికి చెందిన సయ్యద్ ఫజిల్‌తో 2021లో వివాహమైంది. ఉద్యోగరీత్యా భర్త హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మామ, కుటుంబ సభ్యులు, ఆడపడుచు అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతోపాటు చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, బాధితురాలి ఫిర్యాదుతో భర్త కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

- **ఆర్థిక సాయం**

**చొప్పదండి:** పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కొత్తూరి స్వామి అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు స్వామి కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదువేలు అందించారు.

**తిమ్మాపూర్:** మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సముద్రాల బాపయ్య తల్లి వెంకటమ్మ(85) మంగళవారం మృతిచెందగా మాజీ సర్పంచ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి సుష్మిత రమణారెడ్డి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

- **పరామర్శ**

**తిమ్మాపూర్:** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందినవారి కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం మంగళవారం పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు.

- **దరఖాస్తుల ఆహ్వానం**

**వీణవంక:** మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్ తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అదే విధంగా 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.